

సాగు సందడి

ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు.

వివరాలు 8లో ▸



మినీ బస్సు బోల్తా

దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా మినీ బస్సు బోల్తా పడి యాత్రికులు తీవ్రంగా గాయపడ్డారు.

వివరాలు 8లో ▸

అలాట్‌మెంట్ అందజేత

మెదక్ కలెక్టరేట్: కార్పొరేట్ కళాశాల స్కీం కింద దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి బుధవారం అలాట్‌మెంట్ కాపీలు అందజేశారు. ఈ పథకం కింద 40 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

11,12 తేదీల్లో జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మెదక్ కలెక్టరేట్: ఈనెల 11, 12 తేదీల్లో జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ ఎల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11వ తేదీ వ్యవసాయం, స్త్రీ శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం, 12వ తేదీ గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం, ఆర్థికం, ప్రణాళికపై సమావేశాలు ఉంటాయని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కోర్టు ప్రాంగణంలో మొక్క నాటుతున్న న్యాయమూర్తులు

మెదక్‌జోన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మెదక్ కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటిన ప్రతి మొక్కను పరిరక్షించేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, జూనియర్ జడ్జి రీటా లాల్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: న్యాయశాస్త్రంలో పట్టభద్రులైన ఎస్సీ విద్యార్థులు ప్రాక్టీస్ చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 7వ తేదీ నుంచి జూలై 6 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఉమ్మడి జిల్లాకు చెందిన వారై ఉండి సంవత్సరానికి రూ.2 లక్షల లోపు ఆదాయం కలిగి ఉండాలన్నారు. గతంలో ఈ పథకంలో లబ్ధి పొంది ఉండకూడదన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రతి నెల రూ.3 వేల చొప్పున 33 నెలల పాటు పారితోషికం అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే కార్యాలయం ఏర్పాటుతో పాటు కంప్యూటర్ సామగ్రి కోసం రూ.50 వేలు, ప్రవేశ ఫీజు సైతం ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు.

సదరం క్యాంపు తేదీలు ఇవే..

మెదక్ కలెక్టరేట్: ఈనెలలో నిర్వహించే సదరం క్యాంపు తేదీలను ప్రకటించినట్లు డీఆర్డీఓ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 12న శారీరక దివ్యాంగులు, 13న మూగ, వినికిడి లోపం, 20న దృష్టిలోపం,21న మానసిక దివ్యాంగులకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన దివ్యాంగులు మీసేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేటాయించిన తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు.

8న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి అనిత

నర్సాపూర్: ఈనెల 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి అనిత తెలిపారు. ఈమేరకు బుధవారం కోర్టులో పోలీస్ అధికారులు, న్యాయవాదులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక్ అదాలత్ పరిధిలోకి వచ్చే కేసుల్లో కక్షిదారులు రాజీ కుదుర్చుకునే విధంగా చట్టబద్ధంగా సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు. సమావేశంలో ఏజీపీ రాఘవేంద్ర, సత్యనారాయణ, సీఐ జాన్‌రెడ్డి, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్ మధుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

12 మంది రిమాండ్

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లిలో గతంలో చేపల చెరువు వివాదంలో పోలీసులపై దాడి చేసి విధులకు ఆటంకం కలిగించిన 12 మందిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు మెదక్ రూరల్ సీఐ కేశవులు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన కొందరు ఈసంఘటనలో పాలు పంచుకున్నారని తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారు ఎంతటి వారైనా ఉపేక్షించమని హెచ్చరించారు.


బీఆర్‌ఎస్‌కు గట్టి దెబ్బ

- అసెంబ్లీ ఎన్నికల్లో పట్టు.. లోక్‌సభకు వచ్చేసరికి విడుపు
- సిద్దిపేటలో స్వల్ప ఆధిక్యం సాధించినా తప్పని ఓటమి
- మూడు సెగ్మెంట్లలో భారీగా తగ్గిన మెజారిటీ
- ఉమ్మడి జిల్లాలో ఏడు చోట్ల చతికిల పడిన వైనం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఉమ్మడి మెదక్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో పట్టు నిలుపుతున్న గులాబీ పార్టీకి ఈ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తీవ్ర నిరాశకు గురి చేశాయి. రెండు దశాబ్దాలుగా కంచుకోటాగా ఉన్న ఈ జిల్లాలో పార్టీకి ఈ ఎన్నికల్లో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఈ ఎన్నికల్లో మెదక్, జహీరాబాద్ లోక్‌సభ స్థానాలను కోల్పోయింది. అయితే సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేటల్లో ప్రత్యార్థి పార్టీల కంటే స్వల్ప ఆధిక్యాన్ని బీఆర్‌ఎస్ సాధించింది. కానీ అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే భారీగా మెజారిటీ తగ్గింది. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ పార్టీ పూర్తిగా చతికిలా పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పదింట ఏడు అసెంబ్లీ సీట్లు విజయం సాధించింది బీఆర్‌ఎస్. ఇప్పుడు మూడో స్థానానికి పరిమితమైంది. గెలుపొందే సీట్లలో మెదక్ స్థానం తప్పకుండా ఉంటుందని పార్టీ భావించినప్పటికీ గెలవలేకపోయింది.

సంగారెడ్డి జిల్లాలో..

మెదక్ లోక్‌సభ స్థానం పరిధిలో సంగారెడ్డి జిల్లాకు చెందిన రెండు అసెంబ్లీ(పటాన్‌చెరు, సంగారెడ్డి) స్థానాలున్నాయి. ఇందులో పటాన్‌చెరు సెగ్మెంట్‌లో బీఆర్‌ఎస్ నామమాత్రపు ఓట్లతో సరిపెట్టుకుంది. బీజేపీ సాధించిన ఓట్లలో సుమారు సగం ఓట్లే రావడంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ఓటమికి దారితీసినట్లయింది. ఇక్కడ ఆయన కేవలం 54,581 ఓట్లకే పరిమితం కాగా.. రఘునందన్‌రావుకు 1,03,775 ఓట్లు వచ్చాయి. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే స్థానం బీఆర్‌ఎస్‌దే. అయినా ఈ ఎన్నికల్లో పట్టు నిలుపుకోలేదు. సంగారెడ్డి సెగ్మెంట్‌లోనూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించినప్పటికీ బీజేపీ కంటే సుమారు 45 వేల ఓట్లు తక్కువగా వచ్చాయి.



మెదక్, నర్సాపూర్‌లో..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ ఎమ్మెల్యే స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఇప్పుడు కూడా ఈ సెగ్మెంట్‌లో బీఆర్‌ఎస్ మూడో స్థానానికే పరిమితమైంది. ఇక్కడ 40,776 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి రఘునందన్‌కు 67,374 ఓట్లు రాగా, రెండో స్థానంలో నిలిచిన బీఆర్‌ఎస్ అభ్యర్థి నీలం మధుకు 55,588 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సీటును బీఆర్‌ఎస్ తన ఖాతాలో వేసుకుంది. కానీ లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి ఇక్కడ పట్టు కోల్పోయింది.

సిద్దిపేట సెగ్మెంట్‌లో భారీగా తగ్గిన మెజారిటీ

లోక్‌సభ ఎన్నికల్లో సిద్దిపేట సెగ్మెంట్లో బీఆర్‌ఎస్ అతి స్వల్పంగా 2,675 ఓట్లు మాత్రమే ఆధిక్యం సాధించింది. అదే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి హరీశ్‌రావు 82 వేల పైచిలుకు మెజారిటీతో గెలిచారు. కానీ ఈ ఎన్నికలకు వచ్చేసరికి బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కేవలం 2,675 ఓట్ల మెజారిటీకే పరిమితమయ్యారు. ఇటు గజ్వేల్‌లోనూ అసెంబ్లీ ఎన్నికల్లో 45 వేలకు పైగా మెజారిటీ వచ్చింది. కానీ ఈ ఎన్నికల్లో కేవలం 28,621 మెజారిటీతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దుబ్బాకలో అసెంబ్లీ ఎన్నికల్లో 53 వేలకు పైగా మెజారిటీ వచ్చింది. కానీ ఈ ఎన్నికల్లో మాత్రం ఇక్కడ 15,841 ఓట్ల మెజారిటీకే పరిమితమైంది. ఈ మూడు చోట్ల ఆధిక్యం వచ్చినా కూడా మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని సెగ్మెంట్లలో ఆశించిన ఓట్లు రాకపోవడంతో గులాబీ పార్టీ విజయం సాధించలేకపోయింది.

జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో..

జహీరాబాద్ అసెంబ్లీ స్థానాన్ని బీఆర్‌ఎస్ కైవసం చేసుకున్నప్పటికీ.. ఈ లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి అత్తెసరు ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ సెగ్మెంట్‌లో బీఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు కేవలం 23,018 ఓట్లు మాత్రమే వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన అందోల్, నారాయణఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్లలో కూడా నామమాత్రంగా 34,186 ఓట్లు రాగా ఇప్పుడు 29,194 ఓట్లకే పరిమితమైంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో పది అసెంబ్లీ స్థానాల్లో ఏడు అసెంబ్లీ స్థానాలను తన ఖాతాలో వేసుకున్న గులాబీ పార్టీకి ఈ ఎన్నికల ఫలితాలు నిరాశకు గురి చేశాయి.

వ్యూహరచనలో వైఫల్యం

- క్యాడర్‌ను ముందుకు నడిపించడంలోనూ..
- గత పరిస్థితులను చక్కదిద్దుకోని బీబీపాటిల్!
- జహీరాబాద్ సెగ్మెంట్‌లో ఓట్లకు గండి



జహీరాబాద్: గత అనుభవాలతో నుంచి మేల్కొనకపోవడమే జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఓటమికి ప్రధాన కారణంగా పలువురు పేర్కొంటున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయనకు జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆశించిన మేర ఓట్లు రాలేదు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మదన్‌మోహన్‌రావుకు జహీరాబాద్ అసెంబ్లీ స్థానంలో 26వేల ఓట్ల భారీ ఆధిక్యత లభించింది. అప్పటి అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి ఎన్నికల్లో పరిస్థితిని చక్కదిద్దుకుంటే ఓటమి నుంచి బయటపడేవారని తెలుస్తోంది. పాటిల్‌పై సురేశ్ షెట్కార్‌కు జహీరాబాద్ అసెంబ్లీ స్థానంలో 35 వేల ఆధిక్యత వచ్చింది. గత లోటుపాట్లను చక్కబెట్టుకునే విషయంలో మాజీ ఎంపీ పూర్తిగా విఫలమయ్యారనే అభిప్రాయాన్ని వ్యక్తమవుతుంది. మహిళల ఓట్లు పార్టీకి పడకపోవడం కూడా ఓటమికి ఒక కారణం. కార్యకర్తల కనీస అవసరాలు తీర్చకపోవడం, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ధీటుగా డబ్బు ఖర్చు చేయలేదనే విమర్శలున్నాయి. కనీసం బూత్ స్థాయి వరకు కూడా టీ, టిఫిన్ల కోసం డబ్బు ఖర్చు పెట్టలేదని కార్యకర్తల వైపు నుంచి అసంతృప్తి వ్యక్తమవుతుంది. బీఆర్‌ఎస్‌లో ఉన్న కొంత క్యాడర్ బీజేపీకి అనుకూలంగా ఓటు వేయిస్తామని చెప్పడంతో నమ్మి మోసపోయినట్లు కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఓటు షేరింగ్ జరగలేదనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. బూత్ స్థాయిలో ఇంటింటికి వెళ్లి బీజేపీకి ఓటు వేయాల్సిన అవసరాన్ని నచ్చజెప్పే విషయంలో నేతలు విఫలం అయ్యారనే అభిప్రాయాన్ని ఎన్నికల విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు. నియోజకవర్గం స్థాయిలో ప్రజా బలం కలిగిన నాయకుడు, ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉన్న నాయకుడు పార్టీలో కొరవడటం మూలంగానే ఆశించిన మేర ఓట్లను రాబట్టుకోలేని పరిస్థితి ఎదురైందని చెబుతున్నారు. కాంగ్రెస్ సాధించిన 35 వేల ఓట్ల ఆధిక్యతలో కనీసం 20 వేల ఓట్లను అనుకూలంగా మలుచుకోవడంతో పాటు, కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న నారాయణఖేడ్, అందోల్ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించి ఉంటే విజయానికి బీజేపీ చేరువై ఉండేదంటున్నారు. పార్టీ నేతల ప్రచారమంతా పైపైనే సాగిందని, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లతో ధీటుగా ఎన్నికల్లో డబ్బును ఖర్చు చేసే విషయంలో బీజేపీ చతికలబడటం కూడా ఓటమికి ఒక కారణంగా పేర్కొంటున్నారు.

సీఎంకు సన్మానం



రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: జహీరాబాద్ లోక్‌సభ ఎంపీగా గెలుపొందిన సురేశ్ షెట్కార్ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, పీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాకేశ్ షెట్కార్‌లతో కలిసి ఆయన హైదరాబాద్‌కు వెళ్లారు. రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సీఎంను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్ సైతం ఆయనను సన్మానించి అభినందించారు.

భారీగా క్రాస్ ఓటింగ్

వన్‌సైడ్‌గా బీజేపీ ఖాతాలో జమ



మెదక్‌జోన్: మెదక్ పార్లమెంట్ ఎన్నికలో పెద్దఎత్తున క్రాస్ ఓటింగ్ జరిగింది. బీఆర్‌ఎస్ నుంచి చీలిన ఓట్లతో పాటు ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు వన్‌సైడ్‌గా బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఖాతాలో జమయ్యాయి. 2019లో ఇదే స్థానం నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోవడం, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలో దుబ్బాక నుంచి పరాజయం పొందడంతో రఘునందన్‌రావుకు సానుభూతి కలిసొచ్చింది. అసెంబ్లీ ఎన్నికలో ఓటమి తర్వాత ఆయన ఎంపీ ఎన్నికపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. నోటిఫికేషన్ వెలువడడం, బీజేపీ అధిష్టానం టికెట్ కేటాయించడంతో ఒంటరిగానే ప్రచారంలో నిమగ్నమయ్యారు. బహిరంగ సభలు, కార్నర్ మీటింగ్‌లకు అగ్రనేతలు వచ్చినప్పటికీ.. జిల్లా, మండలస్థాయి కార్యకర్తలతో కలిసి ముమ్మరంగా ప్రచారం కొనసాగించారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చి మెదక్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని ఓటర్లను ప్రసన్నం చేసుకున్నారు. మోదీ చరిష్మా సైతం తోడు కావడంతో తిరుగులేని విజేతగా నిలిచారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తరఫున మాజీ మంత్రి హరీశ్‌రావు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒక్క మెదక్ తప్ప అన్నిచోట్ల బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నారు. వారు గడప గడపకు ప్రచారం నిర్వహించినా ఆశించిన ఫలితం రాలేదు. అలాగే అధికార కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు పక్షాన అన్ని నియోజకవర్గాల్లో ముఖ్య నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో పాటు మైనంపల్లి హన్మంతరావు, ఎమ్మెల్యే రోహిత్‌రావు, జగ్గారెడ్డి, మంత్రి దామోదరతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రచారం చేశారు. అయినా మెదక్ పార్లమెంట్ చేజారింది.

బీజేపీ, బీఆర్‌ఎస్ మిలాఖత్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్: బీజేపీతో బీఆర్‌ఎస్ లోపాయికారి ఒప్పందం చేసుకోవడంతోనే తమ అభ్యర్థి నీలం మధు ఓటమి చెందారని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆరోపించారు. బుధవారం వారు నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. సిద్దిపేటలో హరీశ్‌రావుకు లక్ష మెజారిటీ వచ్చేదని, ప్రస్తుత ఎన్నికలో ఆ మెజారిటీ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి కలిసి ఆపార్టీ కార్యకర్తల భవిష్యత్‌ను నాశనం చేశారని అన్నారు. భవిష్యత్‌లో బీఆర్‌ఎస్ ఇబ్బందుల పాలు కాగానే హరీశ్‌రావు బీజేపీలో చేరడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ ఓట్లు బీజేపీకి పడినందునే రఘునందన్‌రావు గెలిచారని చెప్పారు. సమావేశంలో నాయకులు సుహాసినిరెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లేష్, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రావు, లలిత, రషీద్, హబీబ్‌ఖాన్, దుర్గేష్, రవీందర్‌గౌడ్, సాగర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల కృషి గొప్పది



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తల కృషి గొప్పదని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి, నియోజకవర్గ మాజీ కన్వీనర్ మల్లేష్‌గౌడ్ అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ.. మూడోసారి మోదీని ప్రధాని చేసేందుకు ప్రజలు అవకాశం ఇచ్చారని తెలిపారు. ప్రజలు బీజేపీపై నమ్మకంతో ఉన్నారని.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలకు అగ్ర నాయకులతో పాటు ఎంపీ రఘునందన్‌రావు అండగా ఉంటారని చెప్పారు. నియోజకవర్గంలో పార్టీ బలం పెరిగిందన్నారు. ఇతర పార్టీల నాయకులు డబ్బు, మద్యం పంపిణీ చేసినా ప్రజలు బీజేపీకే పట్టం కట్టారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు శంకర్, బాల్‌రాజ్, అరవింద్‌గౌడ్, భిక్షపతి, రాజు, వెంకట్‌రెడ్డి, ఎల్లం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

ఎస్పీ బాలస్వామి

మనోహరాబాద్(తూప్రాన్): మొక్కలు నాటి సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిదని ఎస్పీ బాలస్వామి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని చెట్లగౌరారం, రంగాయపల్లి శివారులోని ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమలో బుధవారం మొక్కలు నాటారు. అనంతరం పరిశ్రమ ఎండీ ప్రదీప్ అగర్వాల్, డైరెక్టర్ అనురాగ్ అగర్వాల్ మాట్లాడుతూ.. పరిశ్రమ నుంచి దుమ్ము ధూళి, దుర్వాసన రాకుండా అధునాతన సాంకేతిక యంత్రాల సహాయంతో పరిశ్రమను నిర్వహిస్తున్నామని తెలిపారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా 5,000 మొక్కలు నాటనున్నట్లు వివరించారు.



మాట్లాడుతున్న ఎస్పీ బాలస్వామి

కార్యక్రమంలో తూప్రాన్ సీఐ కృష్ణ, ఎస్ఐ కరుణాకర్ రెడ్డి, పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ నర్సింహా, పరిశ్రమ ప్రతినిధులు, చెట్లగౌరారం పంచాయతీ కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో యూనిఫాం అందించాలి

డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు

మెదక్ కలెక్టరేట్: పాఠశాలల ప్రారంభంలోగా విద్యార్థుల యూనిఫాం స్టిచ్చింగ్ పూర్తయ్యేలా కృషి చేయాలని డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు ఏపీఎంలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఏపీఎంలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 12న పాఠశాలలు ప్రారంభం కానున్నాయని, 8వ తేదీ వరకు యూనిఫాం స్టిచ్చింగ్ పూర్తి చేసి హెచ్‌ఎంలకు అప్పగించాలని సూచించారు. అవసరమైన టైలర్లను సమకూర్చుకొని స్టిచ్చింగ్ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీఆర్డీఓ సరస్వతి, డీపీఎం మోహన్ కెనడి, ప్రకాష్, ఏపీఎం కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా పెన్నిధి స్త్రీనిధి

- ఈ ఏడాది లక్ష్యం రూ.78.19 కోట్లు
- 'సాక్షి'తో స్త్రీనిధి రీజినల్ మేనేజర్ గంగారాం



మెదక్ కలెక్టరేట్: స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి ప్రతి ఏడాది లక్ష్యానికి మించి రుణాలు ఇస్తున్నామని స్త్రీనిధి రీజినల్ మేనేజర్ గంగారాం తెలిపారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఇప్పటివరకు జిల్లాలో 9,593 మందికి రుణాలు ఇచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 16,104 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, వాటిలో 9,593 సభ్యులు స్త్రీనిధి ద్వారా రుణాలు పొంది స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించినట్లు వివరించారు. గతేడాది స్త్రీనిధి ద్వారా వంద శాతం లక్ష్యానికి మించి రుణాలు అందించామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2024– 25) స్త్రీనిధి ద్వారా 78.19 కోట్లు మహిళా సంఘాల సభ్యులకు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

రూ.5 వేల నుంచి రూ.5 లక్షలు

స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాల్లోని ఒక్కో సభ్యురాలికి రూ.5 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అయితే వారు చేసే వ్యాపారాన్ని బట్టి రుణాలు ఇస్తామన్నారు. సోలార్ ప్యానల్స్, ఎలక్ట్రిక్ బైక్స్, జనరిక్ మెడికల్‌షాపు, పెరటి కోళ్ల పెంపకం కోసం రుణాలు అందిస్తామని చెప్పారు.

రుణ పథకాలు ఇలా..

సువిధ పథకం ద్వారా రూ.40 వేల వరకు, ప్రగతి పథకం కింద రూ.45 వేల నుంచి రూ.75 వేల వరకు, అక్షయ ద్వారా రూ.75 వేల నుంచి రూ.1 లక్ష 25 వేల వరకు, సౌభాగ్య కింద రూ.1 లక్ష 25 వేల నుంచి 3 లక్షల వరకు, ఐశ్వర్య కింద రూ.3 నుంచి 5 లక్షల వరకు రుణాలు అందజేయనున్నట్లు వివరించారు. కేవలం 11 శాతం అంటే రూ.92 పైసల వడ్డీతో ఎలాంటి ఖర్చు లేకుండా లోన్ అందజేయనున్నట్లు చెప్పారు.

సభ్యులకు సురక్ష ఇన్సూరెన్స్

స్త్రీనిధి సంస్థలో లోన్ తీసుకున్న సభ్యులకు సురక్ష ఇన్సూరెన్స్ కల్పిస్తున్నట్లు తెలిపారు. లోన్ తీసుకున్న సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే అప్పటి వరకు కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వడంతో పాటు మిగితా రుణం మాఫీ అవుతుందన్నారు. జిల్లాలోని మెదక్, హవేళిఘణాపూర్, రేగోడ్, మనోహరాబాద్, కొల్చారం మండలాల్లో సభ్యులు తీసుకున్న రుణాలు రెగ్యులర్‌గా చెల్లిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని వివరించారు.

రూ.17 కోట్ల బకాయిలు

జిల్లాలో ప్రస్తుతం రూ.17 కోట్ల బకాయిలు ఉన్నట్లు స్త్రీనిధి రీజినల్ మేనేజర్ తెలిపారు. అందులో రామాయంపేట, చేగుంట మండలాల్లో రూ.1.50 కోట్లు, తూప్రాన్‌లో రూ.1 కోటి, నిజాంపేటలో రూ.1.40 కోట్లు, చిన్నశంకరంపేటలో రూ.1.32 కోట్లు, టేక్మాల్‌లో రూ.1 కోటి, వెల్దుర్తిలో రూ.1.25 కోట్ల బకాయిలు ఉన్నట్లు చెప్పారు. కలెక్టర్, డీఆర్డీఓ, మెప్మా అధికారుల ఆధ్వర్యంలో సంఘాల సభ్యులకు అవగాహన కల్పించి బకాయిలు వసూలు చేస్తున్నట్లు వివరించారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

- జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలు
- జిల్లా ఉపాధి కల్పన అధికారి నీల రాఘవేందర్

సిద్దిపేటరూరల్: జర్మనీలోని టామ్‌కామ్, ఫెడరల్ ఎంప్లాయిమెంట్ ఏజెన్సీల ట్రిపుల్ విన్ పాట్నర్ లో భాగంగా జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాల భర్తీకి జిల్లాలోని అర్హులైన యువత దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి నీల రాఘవేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జర్మనీకి రిక్రూట్ అయ్యే నర్సులకు భాషా శిక్షణ కోసం ప్రత్యేక స్క్రీనింగ్, ఎన్‌రోల్‌మెంట్ ప్రోగ్రాం జరుగుతుందని పేర్కొన్నారు. 21 నుంచి 38 ఏళ్ల వయస్సు వారు అర్హులని, గుర్తింపు పొందిన కళాశాల నుంచి నర్సింగ్, ఐసీయూ, జెరియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, సైకియాట్రి, కార్డియాలజీ, నియోనాటల్, సర్జికల్ వార్డుల్లో కనీసం 1 నుంచి 3 ఏళ్ల అనుభవంతోపాటు జర్మన్ భాషా నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులు ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు బీ-1 భాషా శిక్షణను స్వదేశంలో పూర్తి చేసిన వారికి జర్మనీలో నర్సింగ్ అసిస్టెంట్‌గా పనిచేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జర్మనీలో బీ-2 గుర్తింపు పరీక్షను పూర్తి చేసిన వారికి రిజిస్టర్డ్ నర్సుగా ప్రమోట్ చేయబడతారని తెలిపారు. అనంతరం కనీస జీతంగా రూ.2,300 నుంచి రూ.2,800 యూరోలు అందించడంతోపాటు ఓవర్ టైమ్ అలవెన్సులు కూడా అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 99088 40438, 89190 47600, 7032379066 నంబర్ గాని, www.tomcom. telangana.gov.inను సంప్రదించాలని తెలిపారు.

కిడ్నాప్ కేసులో నిందితుల రిమాండ్

జహీరాబాద్ టౌన్: కిడ్నాప్ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ చేశామని జహీరాబాద్ టౌన్ సీఐ రాజబోయిన రవి తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అల్గోల్ గ్రామానికి చెందిన దిడ్డిబాయి లక్ష్మారెడ్డి(34)ని పట్టణంలోని భరత్‌నగర్‌కు చెందిన ఎండీ. ఖదీర్(44), షేక్ ఇర్ఫాన్(21), అహ్మద్ హుసేన్(22), జమీర్ పాషా(20) మరికొంత మంది కలిసి ఈ నెల 4 తేదీన కిడ్నాప్ చేశారు. హత్య చేయాలని ఉద్దేశ్యంతో ఇనుపరాడ్లతో కొట్టారు. తీవ్రంగా గాయపడిని లక్ష్మారెడ్డి చాకచక్యంగా తప్పించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసి షేక్ ఇర్ఫాన్, అహ్మద్ హుసేన్, జమీర్ పాషలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని, ప్రధాన నిందితుడు ఖదీర్ పరారీలో ఉన్నాడని సీఐ పేర్కొన్నారు.

డీఎస్పీ, ఎస్ఐకి జరిమానా

కోర్టు ధిక్కారానికి పాల్పడిన అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): కోర్టు ధిక్కారానికి పాల్పడిన డీఎస్పీ, ఎస్ఐలకు హైకోర్టు జస్టిస్ మాధవిదేవి జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి సికింద్లాపూర్ గ్రామ పరిధిలోని భూమి వివాదంలో భూ యజమాని కరుణాకర్‌రెడ్డి హైకోర్టుని ఆశ్రయించారు. అందుకు సంబంధించి గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుని పట్టించుకోలేదు. దీంతో కరుణాకర్‌రెడ్డి మళ్లీ కోర్టు ఆశ్రయించాడు. దీంతో అప్పటి తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, ఎస్ఐ రవికాంత్‌రావుకు చెరో రూ.2,000 వేలు చొప్పున జరిమానా విధించారు. జరిమానా కట్టకపోతే 10 రోజులు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. ఇదే కేసులో పిటిషన్ దారుడిని ఇబ్బందులకు గురి చేసినా మెస్సేర్స్ ఇష్టా బిల్డర్ అండ్ డెవలపర్స్ డైరెక్టర్స్ సందీప్, నిఖిల్‌రెడ్డికి నెల జైలు శిక్షతోపాటు రూ.2,000 వేలు జరిమానా విధించడంతోపాటు పిటిషనర్ దారుడికి రూ.50 వేలు చెల్లించాలని తీర్పునిచ్చారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

సిద్దిపేటఅర్బన్: ఓ వ్యభిచార గృహంపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, త్రీ టౌన్ పోలీసులు దాడి చేసి నిర్వాహకురాలిని, విటుడితోపాటు మహిళను పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. సిద్దిపేట పట్టణంలోని మైత్రీ వనంలో సంద కవిత అనే మహిళ తన ఇంటిలో ఇతర మహిళలతో కలిసి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు బుధవారం సమాచారం అందింది. వెంటనే వ్యభిచార గృహంపై దాడి చేసి నిర్వాహకురాలితోపాటు ఒక విటుడు సంకోజు మహేశ్, మహిళను అదుపులోకి తీసుకున్నాం. వారి వద్ద నుంచి రూ.1,470, మూడు సెల్ ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

సాగు సందడి



సదాశివపేట పట్టణంలో విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేస్తున్న రైతులు

ఇటీవల జిల్లాలో కురిసిన మోస్తారు వర్షాలకు వాతావరణం కాస్త చల్లబడింది. దీంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే నైరుతి రుతుపవనాలు కేరళ రాష్ట్రాన్ని తాకాయంటూ వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. వర్షాలు కూడా ఈసారి సమృద్ధిగా కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. పొలాలను దుక్కిదున్నడం, విత్తనాలు కొనుగోలు చేయడం ప్రారంభించారు. అలాగే, రైతులు తొలకరికే తొందరపడితే నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఒకటి, రెండు భారీ వర్షాలు కురిసిన తర్వాతనే పంటలు వేసుకుంటే మేలని సంబంధిత శాఖ అధికారులు సూచిస్తున్నారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ

- జిల్లా వ్యాప్తంగా విత్తనాలు కొనుగోలు
- వివిధ రకాల పంటలకు పొలాలు సిద్ధం
- గణనీయంగా పెరగనున్న పత్తి
- 7,24,405 ఎకరాల్లో ఖరీఫ్ సాగు అంచనా

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వానాకాలం సీజన్ మొదలు కావడంతో పంటల సాగుపై రైతుల్లో ధీమా కనిపిస్తోంది. ముందుగానే విత్తనాలను వేసుకుంటే పంటలు ఏపుగా పెరుగుతాయని భావిస్తున్నారు. ఇప్పటికే ఎరువులు,విత్తనాలను కొనుగోలు చేసి సాగు పనులు ప్రారంభించారు. దీంతో జిల్లాలోని రైతులతో విత్తన, ఎరువుల దుకాణాలు కిక్కిరిసిపోతున్నాయి.

వేసవి దుక్కులు పూర్తి

జిల్లాలో 7,24,405 ఎకరాల్లో ఖరీఫ్ సాగును అధికారులు అంచనా వేయగా.. ఇందులో పత్తి 3.60 లక్షల ఎకరాలు, 1.50 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేయనున్నారు. ఎక్కువగా పండించే పత్తి, వరి, సోయా, కంది, జొన్న, మొక్కజొన్న పంటలను సాగుకు అవసరమైన ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఇప్పటికే వేసవి దుక్కులను పూర్తి చేసిన రైతులు పంట చేలను చదును చేయడం, చెత్తను ఏరివేయడం, సేంద్రియ ఎరువులను తరలించడం లాంటి పనుల్లో నిమగ్నమయ్యారు. వేడి నేలల్లో విత్తనాలను వేస్తేనే సరైన పంట దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. తొలకరికి ముందే విత్తనాలు వేసినా నీటి తడులను అందించాల్సి ఉంటుంది. మరో మూడు రోజుల తర్వాత వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగును చేపడితే మంచిదని అధికారులుసూచిస్తున్నారు.

జిల్లాలో పత్తి పంట ప్రధానం..

జిల్లాలో పండించే పంటలలో పత్తి పంటనే ప్రధానంగా కనిపిస్తుంది. రెండేళ్లుగా ప్రభుత్వం పత్తి పంట రైతులను ప్రోత్సహిస్తూ వస్తోంది. పత్తి పంటకు అనువైన నల్లరేగడి నేలలు ఉండడం, మద్దతు ధరలు కూడా భారీగా పెరగడంతో రైతులు పత్తి సాగుకే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. అలాగే, మార్కెట్ వసతి మెరుగ్గానే ఉండడంతో సాగుకు ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 3.60లక్షల ఎకరాలలో పత్తి పంట సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. సుమారుగా 8 లక్షల పత్తి ప్యాకెట్లు అవసరమని అధికారులు చెబుతున్నారు. వాణిజ్య పంట అయిన పత్తికి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో ఇక ఈ పంటకు ఢోకా లేదంటున్నారు.దీంతో మునుపెన్నడూ లేని విధంగా జిల్లాలో పత్తి పంట సాగు విస్తీర్ణం పెరగనుందని అంచనా వేస్తున్నారు. అయితే పత్తి పంట సాగుకు పెట్టుబడి వ్యయం కూడా ఎక్కువగానే పెరిగిపోతోందని రైతులు చెబుతున్నారు. పరిస్థితులు అనుకూలిస్తే పత్తి పంట తెల్ల బంగారమయ్యే అవకాశం ఉందంటున్నారు.

తొలకరి వర్షాలకు తొందర పడొద్దు

వానాకాలం సీజన్‌లో విత్తనాలను సరైన తేమలో విత్తితేనే మొలక శాతం ఎక్కువగా ఉంటుంది. ఒకటి, రెండు భారీ వర్షాలు కురిసిన తర్వాతనే రైతులు పంటల సాగును చేపట్టాలి. తొలకరి వర్షాలకు తొందరపడితే నష్టపోయే ప్రమాదం ఉంది. పొడి నేలలో విత్తనాలు వేసి వర్షాల కోసం ఎదురు చూడొద్దు. విత్తనం వేసిన 4 రోజుల పాటు వర్షాలు కురవకపోతే నష్టపోయే అవకాశం ఉంది. రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించి విత్తనాలను వేసుకోవాలి.

– మనోహర, ఏడీఏ, సంగారెడ్డి

పరిహారం తర్వాతే పనులు

పనులు ప్రారంభానికి అధికారుల కసరత్తు

- గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్స్ సర్వే పూర్తి
- 2,240 ఎకరాల భూమి అవసరం
- ఎన్నికల ముగియడంతో పనులపై రైతుల ఆశలు



గౌరవెల్లి ప్రాజెక్టు కుడి కాల్వ

హుస్నాబాద్‌లోని గౌరవెల్లి ప్రాజెక్టుకు రీ డిజైన్ చేసి తెలంగాణ ప్రభుత్వం 95 శాతం పనులు పూర్తి చేసింది. ఇందులో భాగంగానే అధికారులు గతేడాది 2023 జూలైలో ట్రయల్ రన్ చేసి నాలుగు రోజులు ప్రాజెక్టుకు గోదావరి జలాలను వదిలారు. కాల్వలు పూర్తి చేసి రైతులకు నీళ్లు అందించాలనుకునే క్రమంలో ఎన్నికలు ఎన్నికలు వచ్చి ప్రభుత్వాలు మారడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఎన్నికల సందడి ముగియడంతో ప్రాజెక్టు పనులు మొదలవుతాయని రైతులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.

–హుస్నాబాద్‌రూరల్

గౌరవెల్లి ప్రాజెక్టును గోదావరి జలాలతో నింపిన తర్వాత ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా చెరువులు నింపి ఆయకట్టు రైతులకు సాగు నీళ్లు అందించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. కుడి కాల్వ ద్వారా 22.79 క్యూసెక్కులు, ఎడమ కాల్వ నుంచి 3.06 క్యూసెక్కుల సాగు నీళ్లను వదులుతారు. కుడి కాల్వ 47 కి.మీలు దూరం, ఎడమ కాల్వ 16 కి.మీల దూరంతో పాటు సబ్ కెనాల్స్ తవ్వడానికి భూ సేకరణకు సర్వే చేస్తున్నారు. కుడి కెనాల్ వెళ్లే అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లో భూ సర్వే పూర్తి చేశారు. రేగొండ వైపు నుంచి వెళ్లే లెఫ్ట్ కెనాల్ కోహెడ మండలంలో కూడా భూ సర్వే పూర్తి చేశారు. 2,240 ఎకరాల భూమి అసరమవుతుందని అధికారులు నివేదికలను సిద్ధం చేశారు. ఎన్నికలు ముగియడంతో భూ పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

భూముల ధరలకు రెక్కలు..

హుస్నాబాద్‌లోని గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంతో వరంగల్, జనగామ, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలోని 1.60 లక్షల ఎకరాలకు 2 పంటలకు సాగు నీరు అందుతాయి. ప్రాజెక్టు నిర్మాణానికి 3845.17 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా ఇప్పటి వరకు 3,805.16 ఎకరాల భూమిని సేకరించారు. మరో 40 ఎకరాల భూమి సేకరిస్తే భూ సేకరణ పూర్తి అవుతుంది. ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రభుత్వం మొదట ఎకరాకు రూ.2.50 లక్షల పరిహారం ఇవ్వగా రీ డిజైన్ తర్వాత పరిహారం రూ.7 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు అందించారు. పరిహారం పొందిన రైతులు పొరుగు గ్రామాల్లో భూములను కొనుగోలు చేయడంతో భూముల రెక్కలు ఆకాశాన్ని అంటాయి. ఇప్పుడు కాల్వలకు 2,240 ఎకరాల భూ సేకరణ చేయాలంటే రైతులు మార్కెట్ ధర ఎకరాకు రూ.30 లక్షల వరకు పలుకుతుంది. భూ నిర్వాసితులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇస్తే భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. అధికారులు రైతులకు పరిహారం ఇచ్చిన తర్వాతనే కెనాల్స్ తవ్వే పనులు మొదలు పెట్టాలని చూస్తున్నారు.

రైతులకు పరిహారం ఇచ్చాకే పనులు చేస్తాం

గౌరవెల్లి ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 63 కి.మీల దూరానికి 2,240 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉంది. రెవెన్యూ అధికారులు ఇప్పటికే భూ సర్వే చేశారు. గతంలో జరిగిన సమస్యలు ఎదురుకాకుండా రైతులకు పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభించాలని చూస్తున్నాం. భూముల మార్కెట్ ధరలు పెరిగినవి, ప్రభుత్వము నిర్వాసితులను ఒప్పించి భూములు తీసుకున్న వెంటనే కాల్వలు తవ్వి పనులు పూర్తి చేస్తాం.

– రాములు నాయక్, ఈఈ, ఇరిగేషన్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి



మొక్క నాటుతున్న న్యాయమూర్తులు సాయి రమాదేవి, స్వాతిరెడ్డి, చందన, శ్రావణి

సిద్దిపేటకమాన్: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట కోర్టు భవనంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అంతకు ముందు కోర్టు ప్రాంగణం నుంచి విక్టరీ చౌరస్తా వరకు న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది నిర్వహించిన ర్యాలీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతిని ప్రేమించండి, పర్యావరణాన్ని రక్షించండి అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలను నాటి, పెంచాలని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని మన ఇళ్లలో కూరగాయలు పండించుకొని తినడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కోర్టు భవనంలో ఇంకుడు గుంతలను తవ్వించి, కోర్టు ఆవరణలో మొక్కను నాటి, న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి మొక్కలను న్యాయమూర్తి పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు స్వాతి రెడ్డి, మిలింద్‌కాంబ్లే, చందన, శ్రావణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, సీనియర్ న్యాయవాదులు మంతూరి సత్యనారాయణ, హరిచంద్ర, ఆత్మరాములు, వై.రాజేశ్వర్‌రెడ్డి, పత్రి ప్రకాశ్, లక్ష్మీ నారాయణ, న్యాయసేవ సిబ్బంది మధు సూదన్ రెడ్డి, ప్రశాంతి, కోర్టు సిబ్బంది సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సీసీఎస్ ఏసీపీ శ్రీనివాస్

సిద్దిపేటజోన్: సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం ప్రముఖ షాపింగ్ మాల్ సిబ్బందికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. తెలియని లింక్‌లను ఓపెన్ చేయొద్దని సూచించారు. ఆన్‌లైన్ మోసాల గురించి వివరించారు. సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

చిన్నశంకరంపేట(మెదక్):ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. పేట ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన దడువాయి పరమేశ్వర్ (35) ఎలాంటి పని చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. రోజు మద్యం తాగితే ఎలా అంటూ కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. దీంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. మద్యానికి బానిసైన యువకుడు మంగళవారం రాత్రి గ్రామ శివారులోని పంటపొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

అక్రమ ల్యాండ్ గ్రాబ్బింగ్ ముఠా అరెస్ట్

- 10 మంది నిందితుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి: అక్రమంగా భూమిలోకి ప్రవేశించి అక్కడ పని చేస్తున్న కూలీలపై దాడి చేసిన ముఠాను సంగారెడ్డి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ రూపేశ్ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వెల్లడించారు. అత్రియా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్ అయిన మంతెన రామకష్ణ శ్రీనివాస్ వర్మ బంజారాహిల్స్‌కి చెందిన పెంద్యాల హరినాథ్ బాబుకు మునిపల్లి మండల పరిధిలో 100 ఎకరాల భూమిని ఇప్పిస్తానని చెప్పాడు. దాని డెవలప్‌మెంట్ పనులు చేస్తామని ఎంఓయూ చేసుకొని రూ.30 కోట్లు తీసుకున్నాడు. తర్వాత పెండ్యాల హరినాథ్ బాబుకు 70 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాడు. ఈ 70 ఎకరాల్లోనే 10 ఎకరాల భూమిని డబుల్ రిజిస్ట్రేషన్ చేశాడు. తనకు ఇంకా 10 ఎకరాల భూమిని ఇవ్వాలని శ్రీనివాస్ వర్మను హరినాథ్ అడిగాడు. పదే పదే హరినాథ్ అడుగడంతో శ్రీనివాస్ వర్మ పగ పెంచుకొని కిరాయి రౌడీలను పెట్టి ఆ భూమి మొత్తాన్ని లాగేసుకోవాలని పథకం వేశాడు. తన వద్ద పని చేస్తున్న గణపతి రాజు (శ్రావణ్), గట్టు ముక్కల భారత్ వర్మ, పీ.అశోక్ రెడ్డి, పాషా, అఖిల్, మరికొంత మంది కిరాయి రౌడీలను మాట్లాడుకున్నాడు. వీరంతా మే 26వ తేదీన హరినాథ్ భూమి వద్దకు వెళ్లి దౌర్జన్యం చేసి అక్కడ పని చేస్తున్న కూలీలపై దాడి చేశారు. 800 ఫెన్సింగ్ కడీలు విరగొట్టారు. ఇందులో గాయపడిన కూలీ గాడిపర్తి రవీందర్ బాబు అనే వ్యక్తి మునిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు 10 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. దాడి చేసినందుకు రౌడీలకు రూ.3.50 లక్షలు శ్రీనివాస్‌వర్మ ఇచ్చాడని, ప్రస్తుతానికి పరారీలో ఉన్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

ప్రేమ జంట అదృశ్యం

- మంజీరా నది వద్ద జంట చెప్పులు, బైక్, సెల్‌ఫోన్ లభ్యం
- ఆత్మహత్యా లేదా ఎక్కడికైనా వెళ్లారా?



బ్రిడ్జిపై సదానంద్, యువతి చెప్పులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రేమ పెళ్లికి పెద్దలు నిరాకరించడంతో ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకొంది. హద్నూర్ ఎస్ఐ రామానాయుడు కథనం మేరకు.. మండల పరిధిలోని కాకిజన్‌వాడ గ్రామానికి చెందిన బేగరి విఠల్‌కు ముగ్గురు కుమారులు. ఇద్దరు కుమారుల వివాహం నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన ఇద్దరు అక్కా చెల్లెళ్లతో జరిపించాడు. మూడవ కుమారుడు సదానంద్(26) తన అన్నలు వివాహం చేసుకొన్న వారి చెల్లెలును (మరదలు) ప్రేమించాడు. ఇరువురు వివాహం చేసుకోవాలని నిర్ణయించారు. ఇందుకు కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. దీంతో మంగళవారం సదానంద్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు రాకపోయే సరికి కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సదానంద్ కుటుంబ సభ్యులు హద్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే బుధవారం రాఘవాపూర్ గ్రామ శివారులో గల మంజీరా నదిపై సదానంద్ బైక్, సెల్‌ఫోన్, చెప్పులు కనిపించాయి. ఇది గమనించిన కాకిజన్‌వాడకు చెందిన వ్యక్తులు సదానంద్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. బ్రిడ్జిపై ఉన్న మోటారు సైకిల్, చెప్పులు, సెల్‌ఫోన్ సదానంద్‌విగా గుర్తించారు. అక్కడే యువతి చెప్పులు కూడా కనిపించాయి. ఇద్దరూ మంజీరాలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారా? లేదా కుటుంబ సభ్యులను భయపెట్టేందుకు బైక్, సెల్‌ఫోన్, చెప్పులు విడిచి వెళ్లారా? అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గజఈత గాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా చీకటి పడడంతో ఆచూకీ లభ్యం కాలేదని ఎస్ఐ రామానాయడు వివరించారు.

ఉపాధి పనికి వెళ్లి ఇద్దరు మృతి

- వర్గల్‌లో గుండెపోటుతో వ్యక్తి..
- దౌల్తాబాద్ మండలంలో మహిళ..



గాలయ్య (ఫైల్)



అనిత (ఫైల్)

వర్గల్(గజ్వేల్): ఉపాధి పనులకెళ్లి గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన విషాదకర ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తున్కిఖాల్సాలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. తున్కిఖాల్సాకు చెందిన రాచకొండ గాలయ్య (37), లావణ్య దంపతులకు శివ, రంజిత్ ఇద్దరు పిల్లలున్నారు. దంపతులు దినసరి కూలీలు. బుధవారం ఉదయం ఉపాధి హామీ పనిలో భాగంగా గ్రామ బర్పటాల కుంటలో భార్యాభర్తలు పూడికతీత పనులకు వెళ్లారు. పని చేస్తున్న క్రమంలో ఛాతిలో నొప్పివస్తుందంటూ గాలయ్య విలవిలలాడిపోయాడు. భార్య అక్కడే ఉండి నీళ్లు అందించి వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తనతోపాటు పని చేస్తూనే భర్త గుండెపోటుకు గురై కళ్ల ముందే చనిపోవడంతో భార్య లావణ్య గుండెలవిసేలా విలపించింది. సమాచారం తెలిసి ఎంపీడీఓ విజయలక్ష్మి గ్రామానికి చేరుకొని లావణ్యను ఓదార్చారు. అంత్యక్రియల నిమిత్తం రూ.5,000 సాయం అందజేశారు. ప్రభుత్వపరంగా తగు సాయం కోసం ప్రతిపాదిస్తామన్నారు.

దౌల్తాబాద్ మండలంలో మహిళ

దుబ్బాకటౌన్: ఉపాధి హామీ పనులకెళ్లి మహిళా కూలీ మృతి చెందిన ఘటన దౌల్తాబాద్ మండల పరిధిలోని చెట్ల నర్సంపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ కథనం మేరకు.. చెట్ల నర్సంపల్లి గ్రామానికి చెందిన పసుల అనిత (34) గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు వెళ్లింది. పనులు చేస్తుండగా అకస్మాతుగా కింద పడి స్పృహ కోల్పోయింది. వెంటనే తోటి కూలీలు డాక్టర్ వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. భర్త స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొనిని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మినీ బస్సు, గూడ్స్ ఆటో బోల్తా

- నార్సింగి మండలంలో 15 మంది యాత్రికులకు తీవ్ర గాయాలు
- కుకునూరుపల్లిలో మరో ఇద్దరికి..



బోల్తా పడిన బస్సు, పక్కనే క్షతగాత్రులు

చిన్నశంకరంపేట(మెదక్): దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా మినీ బస్సు బోల్తా పడి యాత్రికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన మెదక్ జిల్లా నార్సింగి మండలం వల్లూర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ కథనం మేరకు.. హైదరాబాద్‌తోపాటు ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన 21 మంది యాత్రికులు మే 24న వారణాసిలోని కాశీ విశ్వనాథుడి దైవదర్శనానికి రైలులో వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో ట్రెన్ టికెట్‌ల కోసం ప్రయత్నించగా బుక్ కాలేదు. దీంతో లక్నో నుంచి మినీ బస్సును మాట్లాడుకొని పయణమయ్యారు. బుధవారం ఉదయం నార్సింగి మండలం వల్లూర్ వద్దకు చేరుకోగానే డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతో మినీబస్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాధిక, వెంకట్‌రెడ్డి, నిర్మల, జ్యోతి, పూర్ణ, ఉమా సుబ్రహ్మణ్యం, రమణతోపాటు మరికొంత మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

చేపల లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ ఆటో..

కొండపాక(గజ్వేల్): గూడ్స్ ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన కుకునూరుపల్లి మండలంలోని లకుడారం వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇల్లంత కుంట మండలంలోని కట్కూర్ గ్రామం నుంచి బుధవారం రాత్రి అశోక్ లీలాండ్ ఆటోలో డ్రైవరు అజయ్‌కుమార్, సురేశ్ చేపలను హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నారు. లకుడారం గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై ఆటో టైరు పగలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. అజయ్‌కుమార్‌కు ఎడమ చేయి విరుగగా, సురేశ్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్సు సిబ్బంది మహేందర్, మల్లేశ్ క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న కుకునూరుపల్లి పోలీసులు ఆటోను పక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



బోల్తాపడిన ఆటో

లారీ బోల్తా పడి డ్రైవర్ మృతి

పటాన్‌చెరు టౌన్: లారీ బోల్తా పడి డ్రైవర్ మృతి ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సోమేశ్వరి కథనం మేరకు.. పంజాబ్ రాష్ట్రానికి చెందిన బాచిత్తర సింగ్(49) బతుకుదెరువు కోసం వచ్చి రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలోనే కేటీసీ ట్రాన్స్‌పోర్ట్‌లో డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 4వ తేదీ తెల్లవారు జామున లారీలో లోడు నింపుకొని బళ్లారి నుంచి కొంపల్లికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామ శివారులోకి రాగానే లారీని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ఓఆర్ఆర్ రేలింగ్‌కు ఢీకొట్టాడు. ఆపై చెట్ల పొదల్లో లారీ బోల్తా పడగా తీవ్ర గాయాలై డ్రైవర్ అక్కడికక్కడ మృతి చెందాడు. ఓఆర్ఆర్ సిబ్బంది పోలీసులుకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వరసకు సోదరుడైన జర్నైల్ సింగ్ మంగళవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడిని ఢీకొట్టిన బైక్..

కౌల్దారం(నర్సాపూర్): రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని బైక్ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని మెదక్-జోగిపేట ప్రధాన రహదారి రంగంపేట గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలం సంగాయిపేట గ్రామానికి చెందిన మారుడి శేఖయ్య రంగంపేట నుంచి స్వగ్రామానికి రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఇదే సమయంలో అదే గ్రామానికి చెందిన చిన్నిగారి రాజు బైక్ పై వెళ్తూ అదుపుతప్పి వృద్ధుడిని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శేఖయ్య, రాజుకి సైతం గాయాలయ్యాయి. గాయపడ్డ ఇరువురిని 108 వాహనంలో మెదక్ ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.